క్లుప్తంగా

ఓటు హక్కు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న డీఆర్డీవో కిషన్

లక్సెట్టిపేట: పద్దెనిమిదేళ్లు నిండినవారు ఓటు హక్కు వినియోగించుకోవాలని స్వీప్ నోడల్ అధికారి కిషన్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు సోమవారం ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం లాంటిదన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వినియోగించుకోవాలన్నారు. తహసీల్దార్ రాఘవేంద్ర రావు, ఎంపీడీవో సరోజ, ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా, ఎలక్టోరల్ ప్రచారకర్త సంధ్యారాణి, కోఆర్డినేటర్ రాంచందర్, ఏపీవో వెంకటరమణ, ఏపీఎం లక్ష్మి పాల్గొన్నారు.

ఓసీలో సౌకర్యాలు కల్పించాలి



ఉద్యోగులతో మాట్లాడుతున్న సత్యనారాయణ

మందమర్రిరూరల్: వేసవి దృష్ట్యా ఏరియాలోని ఓసీల్లో ఎండతీవ్రతను ఎదుర్కొనేందుకు చేపట్టే చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఏరియాలోని కేకే–ఓసీని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఓసీ క్వారీలో అదనపు షెల్టర్లు, నీటి కుండలు ఏర్పాటు చేయాలని, రుమాళ్లు, మజ్జిగ పంపిణీ చేయాలన్నారు. సిబ్బంది పనిముట్లు దాచుకోవడానికి బాక్సులు, క్యాంటీన్‌లో సౌకర్యాలు కల్పించాలన్నారు. నాయకులు కుమారస్వామి, రాజేష్, తిరుపతి ఉన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న సీఐ శశిధర్

కాసిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని మందమర్రి సీఐ శశిధర్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్ష రాసేలా చూడాలన్నారు. కాసిపేట ఎస్సై గంగారాం, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

దారి మూసివేయాలి



రెండు షటర్ల మధ్య ఉన్న దారి

మంచిర్యాలక్రైం: మంచిర్యాల రైల్వేస్టేషన్ సమీపంలోని మైసమ్మ గుడి వద్ద దోపిడీ దొంగలు, గంజాయి గ్యాంగ్‌లకు అడ్డాగా మారింది. గాంధీ పార్కు ఎదురుగా దుకాణాల వెనుకాల రైల్వే ప్రహరీని కూల్చి రైల్వేస్టేషన్, మైసమ్మ గుడికి వెళ్లేందుకు అడ్డదారిని ఏర్పాటు చేసుకున్నారు. రాత్రివేళ ఒంటరిగా వెళ్లేవారిపై కర్రలు, కత్తులతో దాడి చేసి నగదు, సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్తున్నారు. పది రోజుల వ్యవధిలో మూడు ఘటనలు చేసుకోగా రెండు వెలుగులోకి వచ్చాయి. దీనిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి, అడ్డదారిని మూసివేయాలని ప్రజలు కోరుతున్నారు.

సన్మానం

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రానికి చెందిన సైదం లక్ష్మీనారాయణ హైకోర్టులో ఎక్సైజ్, ఐటీ శాఖల ఏజీపీగా చేపట్టి తొలిసారి మంచిర్యాలకు రావడంతో ఆయన మిత్రులు సన్మానించారు. మిత్రులు బోడ ధర్మేందర్, గోర్ల సంతోష్, నెల్లూరి చంద్రశేఖర్‌రావు, గాదర్ల సతీశ్‌కుమార్, గుండా శివ, రాజ్‌దాస్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

రామకృష్ణాపూర్: స్థానిక మైన్స్ రెస్క్యూ స్టేషన్ ఆవరణలో గల కనకదుర్గాదేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణాహుతి, కుంభహోమం, చండీయాగం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం గుప్తా దంపతులు, మందమర్రి ఎస్‌ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి దంపతులు, రెస్క్యూ స్టేషన్ ఇన్‌చార్జ్ రామ్మోహన్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మహా అన్నదానం చేపట్టారు.

చేతుల్లో చరవాణి..ఇదే ప్రజావాణి

- గ్రీవెన్స్‌లో అధికారులు సెల్‌ఫోన్లలో లీనం
- 22 శాఖల అధికారులకు ఆరుగురే హాజరు



నెన్నెల ప్రజావాణిలో స్మార్ట్‌ఫోన్లలో నిమజ్ఞమైన అధికారులు

నెన్నెల: ప్రజల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి మండల కేంద్రాల్లో ప్రజావాణి ఏర్పాటు చేశారు. ప్రతీ సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 22 శాఖలకు సంబంధించిన అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వినతులు స్వీకరించాలి. కాని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో ఆరు శాఖల అధికారులు పాల్గొన్నారు. దీంతో అర్జీలు ఇవ్వడానికి ఎవరూ రాలేదు. హాజరైన అధికారులు చేసేది ఏమి లేక స్మార్ట్‌ఫోన్లలో ఎవరికి వారే లీనమయ్యారు. అందరూ చేతుల్లో సెల్‌ఫోన్లు పట్టుకొని వాట్సాప్, స్టేటస్‌లు చూస్తూ 1 గంట వరకు కాలయాపన చేస్తూ మొక్కుబడిగా ప్రజావాణి కార్యక్రమాన్ని ముగించారు.

ప్రజావాణికి స్పందన కరువు

జన్నారం: ప్రజావాణి కార్యక్రమానికి స్పందన కరువైంది. అధికారులు వేచి చూస్తున్నా ప్రజల నుంచి అర్జీలు రావడం లేదు. మండలంలో సోమవారం తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో శశికళ, శాఖల అధికారులు హాజరయ్యారు. మూడు అర్జీలు మాత్రమే వచ్చాయి. ఒకటి టైగర్‌జోన్ ఎత్తివేయాలని, రెండోది 33 కేవీ లైన్ ఏర్పాటు చేయాలని, మరో భూమి కబ్జా గురించి దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. అయితే ప్రజలు తమ దరఖాస్తును మంచిర్యాల కలెక్టరేట్‌కు ఇస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు ఇక్కడ ఇస్తే పరిష్కారం చేస్తారో..లేదో అనే సందేహం వారిలో ఉంది.

అర్జీలు అందజేత

భీమారం: మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఇద్దరు తమ సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో రాధకు అర్జీలు అందజేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజావాణిపై విస్తృత ప్రచారం కల్పించనున్నట్లు తెలిపారు. వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్‌లో..

చెన్నూర్‌రూరల్: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. రెవెన్యూకు సంబంధించిన నాలుగు ఫిర్యాదులు వచ్చినట్లు ఎంపీడీవో మోహన్ తెలిపారు. ఈజీఎస్ ఏపీవో గంగాభవాణి, ఐకేపీ ఏపీఎం ప్రమీల, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సరిత, ఏఈ పీఆర్‌ఏఆర్ శివకుమార్ పాల్గొన్నారు.

బాధలు చెప్పకముందే పంపేశారు..!

మంచిర్యాలఅగ్రికల్చర్: కలెక్టర్‌కు సమస్యపై గోడు వెల్లబోసుకుంటేనైన పరిష్కారం దొరుకుతొందని ఆశతో వస్తున్న అర్జీదారులను నిరాశకు గురికావాల్సిన పరిస్థితి. కలెక్టరేట్‌లలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మండలాల నుంచి వచ్చిన అర్జీదారులు ఫిర్యాదు పత్రాలతో కలెక్టర్ వద్దకు రాగా సమస్య వివరించేలోపే అక్కడ ఉన్న గన్‌మెన్ వారిని పక్కకు నెట్టేశారు. దీంతో గన్‌మెన్‌తో వాగ్వాదానికి దిగారు. కలెక్టర్‌కు మా బాధ చెప్పుకుంటేనైనా సమస్య పరిష్కారం దొరకుతుందని వస్తే ఇలా నెట్టి వేస్తున్నారని వాపోయారు.



కలెక్టర్‌కు అర్జీ అందజేసిన వ్యక్తిని పట్టుకుని బయటకు పంపుతున్న గన్‌మెన్

పక్కకు నెట్టేశాడు..



భూ సమస్య పరిహారంపై మండల కార్యాలయంలో పలుమార్లు విన్నవించిన పరిష్కారం కాలేదు. ప్రజావాణిలో కలెక్టర్‌కు అర్జీ ఇచ్చేందుకు అన్ని ధ్రువపత్రాలతో వివరిస్తుండగా గన్‌మెన్ పక్కకు నెట్టేశాడు. ఆగండి అన్నా.. నా కాలు మంచిగా లేదని చెప్పినా వినలేదు. – తుమ్మటి మల్లారెడ్డి

మూత 'బడి'..



సుబ్బరాంపల్లిలో మూతపడ్డ ప్రభుత్వ పాఠశాల

- విద్యార్థుల సంఖ్య లేకనే..
- మూతపడిన సుబ్బరాంపల్లి పాఠశాల
- గతంలో ఏడు పాఠశాలలు కూడా..

చెన్నూర్‌రూరల్: విద్యార్థుల సంఖ్య లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయి. ఇప్పటికే కొన్ని పాఠశాలలు మూతపడి భవనాలు నిరుపయోగంగా మారాయి. దీంతో ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై వేరే పాఠశాలలకు వెళ్లాల్సి వస్తోంది. మండలంలో మొత్తం 47 ప్రభుత్వ ప్రాథమిక, 7 ప్రభుత్వ ప్రాథమికోన్నత, 9 జెడ్పీఎస్ఎస్ పాఠశాలలు ఉన్నాయి.

గతంలో మూతపడ్డ పాఠశాలలు

గతంలో విద్యార్థుల సంఖ్య లేకపోవడంతో బొక్కలగూడెం, కాంబోజీపేట, కమ్మరిపల్లి, దుబ్బపల్లి, మందపురం, వస్తాద్‌పల్లి, ముత్తరావుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. దీంతో ఆ భవనాలు నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం సుబ్బరాంపల్లి పాఠశాలలో విద్యార్థులు లేకపోవడంతో మూతపడింది. ఇక, శివలింగాపూర్, ఒడ్డెపల్లి ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. సంబంధిత అధికారులు పట్టించుకుని విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు చేపట్టాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

విద్యార్థుల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. పిల్లల తల్లిదండ్రులు సహకరించాలి. సుబ్బరాంపల్లిలోని పాఠశాలలో విద్యార్థుల సంఖ్య లేకపోవడంతో మూతపడింది.

– కె.రాధాకృష్ణమూర్తి, ఎంఈవో, చెన్నూర్

తెరుచుకోని ప్రజాపాలన సైట్

- ఇబ్బందుల్లో ప్రజలు

నెన్నెల: గృహజ్యోతి పథకం కింద ఆహార భద్రత కార్డులు ఉన్న వారందరికి నెలకు 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేస్తున్నారు. ఈనెల 1 నుంచి జీరో బిల్లులు ఇస్తున్నారు. అర్హులెవరైనా ఉంటే ఆయా ఎంపీడీఓ కార్యాలయాల్లో, మున్సిపాలిటీల్లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం పేర్కొంది. చాలా మంది అర్హులు దరఖాస్తులు చేయడానికి ఎంపీడీవో, మున్సిపాలిటీలకు వెళ్తున్నారు. అక్కడ దరఖాస్తులు అందజేస్తున్నారు. కొత్త దరఖాస్తులు స్వీకరించడానికి సైట్ పని చేయడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. లాగిన్ ఇచ్చిన తర్వాతే మీ వివరాలను అప్‌లోడ్ చేస్తామని తెలియజేస్తున్నారు. సైట్ తెరిచి దరఖాస్తుదారుల వివరాలను అందులో నమోదు చేసిన తర్వాతే పథకం వర్తిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ప్రజాపాలన సైట్ ఎప్పుడు ఓపెన్ కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభం

వేమనపల్లి: ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఎంపీవో బాపురావు ప్రారంభించారు. నీల్వాయి గ్రామానికి చెందిన నికాడి గంగుమేర జీరో కరెంట్ బిల్లు రాలేదని దరఖాస్తు అందించారు. ఏపీఎం ఉమారాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సువర్ణ, ఏపీఓ సత్యప్రసాద్ పాల్గొన్నారు.



వేమనపల్లి: దరఖాస్తు స్వీకరిస్తున్న ఎంపీవో బాపురావు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు చేసి అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా 134 దరఖాస్తులు స్వీకరించినట్లు ప్రకటించారు.

దరఖాస్తుకు మరో అవకాశం

నస్పూర్: ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారికి మరో అవకాశం కల్పిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ వేణు, కమిషనర్ సతీశ్ ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అర్హులు పాస్‌ఫొటో, ఆధార్ కార్డు, తెల్ల రేషన్‌కార్డు, కరెంట్, గ్యాస్ బిల్ తదితర ధ్రువపత్రాలతో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజాపాలన కౌంటర్‌లో సంప్రదించాలని సూచించారు.

పాఠశాలలో మాక్ పార్లమెంట్

భీమారం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోటీలో ఉన్న విద్యార్థుల జాబితాను బూత్ వద్ద ప్రదర్శించారు. వారికి ఇచ్చిన పోల్‌చిట్టీ తీసుకుని బూత్‌లో ఓట్లు వేశారు. ఎన్నికల అధికారులుగా విద్యార్థులు నిర్వహించారు. మొత్తం 156 ఓట్లు పోల్ కాగా, అందులో పోటీలో ఉన్న 9వ తరగతి విద్యార్థి రాకేశ్ 106తో విజయం సాధించారు. తహసీల్దార్ సదానందం, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణలు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. ఏప్రిల్‌లో జరిగే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు హెచ్‌ఎం విక్రమ్ తెలిపారు.



ఓటింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

శ్రీరాంపూర్: మున్నూరు కాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య డిమాండ్ చేశారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 26 శాతం జనాభా ఉన్న మున్నూరు కాపులకు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కోకాపేటలో సంఘ భవన నిర్మాణానికి అదనంగా రూ. 20 కోట్లు కేటాయించాలన్నారు. జనాభా ఆధారంగా రాబోయే ఎన్నికల్లో అన్నిపార్టీలు జనాభా నిష్పత్తి ప్రకారం టికెట్లు ఇవ్వాలన్నారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారామ్, యూత్ రాష్ట్ర అధ్యక్షుడు సంజీవ్, మున్నూరు కాపు డెవలప్‌మెంట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రవి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అధికారులకు సన్మానం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్ కాస్టు గనిలో ఇద్దరు అధికారులను సన్మానించారు. ప్రాజెక్ట్ అధికారిగా పనిచేసి ఏరియా ఎస్‌ఓటూ జీఎంగా పదోన్నతిపై వెళ్తున్న పురుషోత్తంరెడ్డిని, నూతన ప్రాజెక్టు అధికారిగా వచ్చిన శ్రీనివాస్‌ను గని అధికారులు ఉద్యోగులు సత్కరించారు. సోమవారం ఓపెన్‌కాస్ట్‌పై వద్ద గని మేనేజర్ సుధీర్ జక్కులవార్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి బాజీసైదా, ప్రాజెక్టు ఇంజనీర్ చంద్రశేఖర్, సర్వే అధికారి సంపత్, రక్షణాధికారి శ్రీనివాస్, అధికారుల సంఘం ప్రతినిధి, కమ్రుద్దీన్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ, మోతె లచ్చన్న పాల్గొన్నారు.

సల్పాలవాగు ఎడమ కాలువ నిర్మించాలి

కాసిపేట: మండలంలోని సల్పాలవాగు ప్రాజెక్టు ఎడమ కాలువ నిర్మాణం చేపట్టాలని సోమవారం ప్రజావాణిలో కోమటిచేనుకు చెందిన రాంటెంకి వాసుదేవ్ తహసీల్దార్ భోజన్నకు విన్నవించారు. సల్పాలవాగు 2005లో నిర్మాణం చేపట్టారని, 3,200 ఎకరాల సాగుభూమి ప్రాజెక్టు కింద ఉన్నప్పటికి కాలువల నిర్మాణం లేకపోవడంతో ఎకరం సాగు కావడం లేదన్నారు. వెంటనే కాలువ పూర్తి చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

వందశాతం పల్స్‌పోలియో

కోటపల్లి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్స్ పోలియో కార్యక్రమం మండలంలో వందశాతం పూర్తయింది. సోమవారం తెలంగాణ–మహబూబాద్ సరిహద్దు ప్రాణహిత నది పరివాహక ప్రాంతాల్లో నివాసం ఉంటున్న జాలర్ల పిల్లలకు హెల్త్ అసిస్టెంట్ సుధాకర్ పోలియో చుక్కలు వేశారు.

ముగ్గుల పోటీలు

పాతమంచిర్యాల: ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని మేదరివాడలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహిళలకు సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. వారు ఉత్సాహంగా పాల్గొని రంగరంగుల ముగ్గులు వేశారు. మహిళా సాధికారక హబ్ జెండర్ స్పెషలిస్టు మౌనిక, ఫైనాన్సియల్ లిటరసీ లిప్సిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆటల పోటీలు

పాతమంచిర్యాల: ప్రపంచ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని సెవెన్‌హిల్స్ పాఠశాలలో మంచిర్యాల మహిళా తరంగిని(మమత) ఆధ్వర్యంలో సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అధ్యక్షురాలు రాచకొండ మంజుల, ఉపాధ్యక్షురాలు లీలా, కార్యదర్శి లత, జాయింట్ సెక్రెటరీ పావని, కోశాధికారి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యోగా శిక్షణ తరగతులు

పాతమంచిర్యాల: ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మైత్రి యోగా సెంటర్ సహకారంతో పట్టణంలో మహిళలకు మంగళవారం నుంచి 31 వరకు ఉచిత యోగా శిక్షణ తరగతులు ఉంటాయని స్నేహ ఫౌండేషన్ డైరెక్టర్ చిదానంద కుమారీ, మైత్రి యోగా శిక్షకులు డాక్టర్ సమీరా తెలిపారు. ఉదయం 5:30 నుంచి 6:30 వరకు ఎంఎం సూపర్ మార్కెట్ ఎదురుగా ఉన్న కేవీ ప్రతాప్ యోగా హాల్‌లో ఈ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

బెల్లంపల్లిరూరల్: మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహేందర్ తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధి హామీ పథకానికి సంబంధించి చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందం నివేదికలను ప్రజావేదికలో సమర్పించనున్నారు. ప్రత్యేక అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

పరామర్శ

జన్నారం: మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జంగం సంతోష్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. చంద్రమౌళి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, మాజీ సర్పంచ్ జాడి గంగాధర్, నాయకులు భరత్‌కుమార్, ఫజల్‌ఖాన్, జనార్దన్, అంజన్న ఉన్నారు.

6న విజయడెయిరీ ముట్టడికి తరలిరావాలి

రామకృష్ణాపూర్: పాడిరైతుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 6న తలపెట్టిన హైదరాబాద్ లాలాపేట విజయ డెయిరీ ముట్టడి కార్యక్రమానికి పాడిరైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పాడిరైతుల సంఘం రాష్ట్ర కోకన్వీనర్ వీరమల్ల రాజయ్య ఓ ప్రకటనలో కోరారు. పాడిరైతుల పాల బిల్లులు, ఇన్సెంటివ్‌లు చెల్లించేవరకు పోరాటం ఆపేదిలేదని పేర్కొన్నారు.

బుర్రకథ

వేమనపల్లి: ప్రాచీన జానపద కళ శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కథాగానంతో మండల కేంద్రం హోరెత్తింది. సోమవారం బ్రహ్మంగారి కథకులు గత నాలుగు రోజులుగా బుర్రకథ రూపంలో స్వామివారి చరిత్ర గానం చేస్తున్నారు. సోమవారం రాత్రి తెల్లవారుజాము రచన జీవన సమాధి కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు.

భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ వేడుకలు

జన్నారం: మండలంలోని ఇందన్‌పల్లి గ్రామంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. నాయకులు జెండా ఎగురవేశారు. నాయకులు వంగపెల్లి సురేశ్, కిరణ్‌రావు, అంజన్న, శ్రీకాంత్, అనిల్‌యాదవ్, మల్లేశ్, లచ్చన్న పాల్గొన్నారు.

మోదీ సభకు తరలిన నాయకులు

మంచిర్యాలక్రైం/దండేపల్లి: ఆదిలాబాద్‌లో సోమవారం జరిగిన ప్రధాని మోదీ సభకు బీజేపీ నాయకులు తరలివెళ్లారు. జిల్లాకేంద్రం నుంచి జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావ్, నాయకులు, దండేపల్లి నుంచి నేతలు, కార్యకర్తలు వాహనాల్లో వెళ్లారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

పాతమంచిర్యాల: తెలంగాణ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ హైదరాబాద్‌లో ఈనెల 3 నుంచి నిర్వహిస్తున్న 9వ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మిటేఫైట్ విభాగంలో జిల్లాకు చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు. హరిత (ప్రథమ), జ్ఞానవి, నిఖిత (ద్వితీయ), మన్విత, లక్ష్మిరాజ్, ఇషితా, తన్విక, సహస్ర, దుర్గేశ్వరి (తృతీయ)స్థానంలో నిలిచారు. కటా విభాగంలో తన్విక (తృతీయ) స్థానంలో నిలిచారు. జిల్లా జట్టుకు కోచ్‌గా రాజేశ్వర్, మేనేజర్‌గా వెంకటేశ్, ప్రసాద్ వ్యవహరించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చినవారిని తెలంగాణ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్‌కుమార్, కోశాధికారి రామస్వామి, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి శివమహేశ్ అభినందించారు.

కోటపల్లి: మందమర్రిలో జరిగిన కాకా వెంకటస్వామి కుంగ్‌ఫూ అండ్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కోటపల్లి ఉషోదయ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బాలుర కటాస్ విభాగంలో రేయన్ష్, రిశ్వంత్ (వెండి), డి గ్రూపులో చందన్ (కాంస్య) పతాకాలు సాధించారు. బాలికల విభాగంలో అంజలి (బంగారు), వర్షిత (వెండి), రిత్విక (కాంస్య) పతకాలు సాధించారని మాస్టర్ తిరుపతి తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను హెచ్‌ఎం ఉమా, ఉపాధ్యాయులు అభినందించారు.

నస్పూర్: ఏడవ నేషనల్ లెవల్ కరాటే అండ్ కుంగ్‌ఫూ ఓపెన్ చాంపియన్ షిప్ 2024 టోర్నమెంట్‌లో నస్పూర్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఆదివారం మందమర్రిలో జరిగిన పోటీల్లో కుమిటే (ఫైటింగ్) విభాగంలో కొరుకొప్పుల నిహారిక (బ్రౌన్ బెల్టు) సాధించగా, సింగిల్ కటాస్ అండ్ టీం కటాస్ విభాగంలో ప్రథమ స్థానంలో టి.నిహాల్, పి. రమాకాంత్, టి.అశ్రిత, పి.శ్రీహరిణి, టి.అవని, బి.శివకుమార్, ద్వితీయ స్థానంలో ఈ.సాన్విత్రీ, బి.అర్హన్, అనురాగ్, ఎస్.స్నేహా, బి.నందన, పి.రాకేశ్‌లు బహుమతులు సాధించారు. మాస్టర్లు రంగ రమేశ్, మహేశ్ వారిని అభినందించారు.



పాతమంచిర్యాల: మెడల్స్ సాధించిన క్రీడాకారులతో కోచ్‌లు

మందమర్రిరూరల్: పట్టణంలోని సీఐఎస్ఎఫ్ బ్యారక్‌లో ఆదివారం నిర్వహించిన 7వ సౌతిండియా కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో పట్టణంలోని గురుకుల సైనిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అశ్విత్, జశ్విత్ పాల్గొని గోల్డ్ మెడల్ సాధించారు. ప్రిన్సిపాల్ లత వారిని అభినందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

దండేపల్లి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషిచేస్తోందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పర్వతి సత్యనారాయణ అన్నారు. మండలంలో పలు పాఠశాలల్లో సోమవారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం దండేపల్లి ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి సంఘ అభివృద్ధికి చేస్తున్న కృషికి ఉపాధ్యాయులు ఆకర్షితులు కావడంతో పీఆర్టీయూ తెలంగాణకు మంచి ఆదరణ లభిస్తుందన్నారు. పెండింగ్ బిల్లుల పరిష్కారంతోపాటు, సీపీఎస్ రద్దు, మిగిలిపోయిన ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ, డీఏ విడుదల వంటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు సంఘం కృషిచేస్తోందన్నారు. సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి సూరినేని గంగాధర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎస్.రవి, కాంతరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.రాజేశ్వర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు బోయిని శ్రీనివాస్, జి.రామ్మోహన్‌రావు, దండేపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇప్ప రవి, పానుగంటి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొమురయ్య వర్ధంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: దివంగత సీపీఐ నేత తాళ్లపల్లి కొమురయ్య 15వ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీరాంపూర్‌లోని ఆయన స్మారక స్తూపం వద్ద పార్టీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కలవేని శంకర్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలో విద్యార్థి దశ నుంచి క్రియాశీలకంగా పనిచేశారన్నారు. ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, కౌన్సిలర్లు మేకల దాస్, చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, ముస్కె సమ్మయ్య, ఎస్కే బాజీసైదా, లింగం రవి, నగేశ్ పాల్గొన్నారు.